# మళ్లీ కాంగ్రెసోళ్ల చేతిలో మోసపోం

- ఈ సారి కారు గుర్తుకే మా ఓటు
- తేల్చి చెప్పిన ఆర్సీ తండా మహిళలు

తిమ్మాజిపేట, ఏప్రిల్ 30: 'కాంగ్రెసోళ్ల చేతిలో ఒక సారి మోసపోయాం.. మళ్లీ మోసపోయేందుకు సిద్ధంగా లేం.. మిమ్మల్ని మోసం చేయం. ఈసారి కారు గుర్తుకే మా ఓటు' అని నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆర్సీ తండా మహిళలు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి హామీ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా మంగళవారం తండాలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా బస్టాండ్ వద్దకు చేరుకున్న మర్రి జనార్దన్‌రెడ్డిని చూసిన వాలి, సీత అనే మహిళలతోపాటు పలువురు ఆయన వద్దకు చేరుకున్నారు. 'కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి మోసపోయాం.. కేసీఆర్, మీ లాంటి మంచి వ్యక్తిని దూరం చేసుకున్నాం. ఈ సారి మాత్రం కారుకు తప్పా వేరే గుర్తుకు ఓటేయం' అని మహిళలు చెప్పడంతో మర్రి ఉద్వేగానికి గురై కంటతడి పెట్టారు. 'కేసీఆర్ ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేటోళ్లు.. ఇప్పుడున్న ఎమ్మెల్యే ఎవరో.. మంత్రులెవరో తెలియడం లేదు. వాళ్లు మా వద్దకు రావడం లేదు. ఫ్రీ బస్సు పేరిట మహిళల మధ్య కొట్లాటలు పెట్టారు.

## రేవంత్‌రెడ్డి మీటింగ్‌కు వెళ్లి వడదెబ్బతో మహిళ మృతి

వీణవంక, ఏప్రిల్ 30: జమ్మికుంటలో జరిగిన సీఎం రేవంత్ రెడ్డి జనజాతర సభకు వెళ్లిన ఓ మహిళ వడదెబ్బతో ప్రాణాలు కోల్పోయింది. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంబాల ఐలమ్మ (56) మంగళవారం జమ్మికుంట పట్టణంలో జరిగిన కాంగ్రెస్ జనజాతరకు మధ్యాహ్నం ట్రాక్టర్‌లో వెళ్లింది. సభ జరుగుతుండగానే ఎండవేడికి తాళలేక ఐలమ్మ కుప్పకూలింది. వెంటనే ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఐలమ్మకు భర్త మధునయ్య, ఒక కొడుకు ఉన్నారు. ప్రభుత్వం మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

## వంటరుచిగా లేదని భార్య హత్య

*దుండిగల్, ఏప్రిల్ 30 : వంట రుచిగా లేదని భార్యను హత్య చేశాడో భర్త. మేడ్చల్ జిల్లా బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. మధ్యప్రదేశ్ రాష్ట్రం బాలాఘాట్‌కు చెందిన రవీనాదుర్వే (26), నవీన్‌దుర్వే దంపతులు. భార్యాభర్తలు హైదరాబాద్‌కు వలస వచ్చారు. ప్రగతినగర్ ప్రగతి కన్‌స్ట్రక్షన్స్ సంస్థలో కూలీలుగా పని చేస్తూ అక్కడే గుడిసెల్లో నివసిస్తున్నారు. సోమవారం రాత్రి 9 గంటలకు మద్యం సేవించి నవీన్‌దుర్వే ఇంటికి వచ్చాడు. భార్య భోజనం వడ్డించగా, వంటరుచిగా లేదంటూ భార్యతో గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో క్షణికావేశంలో నవీన్‌దుర్వే అక్కడే ఉన్న ఇటుకరాయితో భార్య తలపై బలంగా కొట్టాడు. దీంతో తలపగిలి ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.*

# 'కవ్వంపల్లి' భేషరతుగా క్షమాపణలు చెప్పాలి

- ఎమ్మెల్యే సోదరుడు ప్రకాశ్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి
- మీడియా సమావేశంలో బీఆర్‌ఎస్ ఎస్సీసెల్ నేతల డిమాండ్

మానకొండూర్, ఏప్రిల్ 30: దళితజాతి ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు కవ్వంపల్లి ప్రకాశ్ తక్షణమే దళిత సమాజానికి భేషరుతుగా క్షమాపణలు చెప్పాలని బీఆర్‌ఎస్ సెల్ మానకొండూర్ నియోజకవర్గ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తాడికల్ మాజీ సర్పంచ్ గంట మహిపాల్‌తోపాటు దళిత సంఘాల నేతలు లింగాల లక్ష్మణ్, ఎనగందుల సుదర్శన్, కనుకుంట్ల అభిలాష్ మాట్లాడారు. కవ్వంపల్లి ప్రకాశ్ ఒక దళితుడై ఉండి దళితజాతి ఆడబిడ్డల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ఊసరవెళ్లిలా పార్టీలు మార్చే కవ్వంపల్లిదే డబ్బులకు అమ్ముడు పోయే చరిత్ర అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని దళిత ఆడబిడ్డలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి, అతని సోదరుడు ప్రకాశ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని, దళిత సోదరీమణులపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారం దాహం తో దళితులను కించపరిచే విధంగా ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఖబడ్దార్ అని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు వంతడ్పుల సంపత్, సంగుపట్ల మల్లేశం, వడ్లూరి శంకర్, ఈస్కుల్ల అంజయ్య, సుదర్శన్, బొజ్జ కోటిలింగం, కొమ్ము సంపత్, డప్పు తిరుపతి, ఎలుక దేవయ్య పాల్గొన్నారు.

## డీసీఏ దాడులు.. ఔషధాలు సీజ్

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): మా ఆయిల్ రాస్తే పక్షవాతం కూడా మటుమాయం.. మా క్యాప్సుల్స్ వాడితే ఇట్టే లావు తగ్గిపోతారు.. అంటూ తప్పుడు ప్రకటనలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ఔషధాలను డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు సీజ్ చేశారు. సోమ, మంగళవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆరుచోట్ల దాడులు చేసినట్టు డీసీఏ అధికారులు తెలిపారు. ఆయా కంపెనీలపై కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.














